తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 248 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శనివారం, జులై 25, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

హిమాయత్ నగర్ లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

హైదరాబాద్: ఢిల్లీలో రాహుల్ గాంధీ పై దాడిని, విద్యార్థులపై లాఠీ చార్జీని, అరెస్టులను ఖండిస్తూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమాయత్ నగర్ కూడలి నుంచి హైదర్ గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హిమాయత్ నగర్ వై జంక్షన్ నుండి హైదర్ గూడ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. నీట్ పేపర్ లికేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం అడుతుందని ఆరోపించారు. ప్రశ్న పత్రాలను కాపాడలేని నాయకులు , దేశాన్ని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థుల డిమాండ్ ను పరిగణలోకి తీసుకుని ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ధర్మేందర్ ప్రధన్ దిష్టిబొమ్మను దహనం చేసారు. పోలీసులు నిరసనకారులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది.

ప్రభుత్వ స్థలాలను త్వరగా గుర్తించండి

పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు చెప్పారు.

కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) లో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి, శుక్రవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, , పొన్నం ప్రభాకర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని తెలిపారు.

క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ. 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ. 6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది.

తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7, 680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్పురా, అంబర్పేట్, కూకట్పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

విద్యార్థులందరికీ పంపిణీ చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ ఫీడ్బ్యాక్ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్బ్యాక్ ఆధారంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎంసీఆర్హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యత విషయంలో రాజీపడబోమని స్పష్టంగా చెప్పారు. ఆగస్టు 15 నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్య కి సూచించారు.

క్యాబినెట్ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, జూలై 24: పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. పోటీ పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపేలా చట్టాన్ని మరింత బలోపేతం చేసే సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే పేపర్ లీక్ కేసుల దర్యాప్తు, విచారణను తప్పనిసరిగా మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. అలాగే వ్యవస్థీకృత పేపర్ లీక్ సిండికేట్లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలు తీసుకురానున్నారు.కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం రాష్ట్రాల మధ్య పనిచేస్తున్న పేపర్ లీక్ మాఫియాలను పూర్తిగా నిర్మూలించడం, ప్రభుత్వ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడం. ప్రస్తుతం ఇలాంటి కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగుతుండగా, ఇకపై ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులు మూడు నెలల్లోనే దర్యాప్తు పూర్తి చేసి తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో నిందితులకు త్వరితగతిన శిక్ష పడటంతో పాటు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది.నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన పేపర్ లీక్ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల నిరసనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2024లో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) చట్టాన్ని మరింత కఠినతరం చేసే సవరణలను కేంద్రం సిద్ధం చేసింది.

నీట్ పేపర్ లీకైన నెలన్నరకు కేటీఆర్ నిద్రలేచారు: మహేశ్కుమార్గౌడ్



హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదు?దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారు" అని మహేశ్కుమార్గౌడ్ విమర్శించారు.

నీజేపీతో ముగిసిన కేంద్రం చర్చలు.. రాజీనామా.... మేం వెనక్కి తగ్గేది లేదు అభిజీత్ దీప్కే



న్యూఢిల్లీ, జూలై 24: నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జకాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో కేంద్రం జరిపిన చర్చలు ముగిశాయి. కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్ సీజేపీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. నీట్ సహా విద్యావ్యవస్థలో కీలక అంశాలపై వీరి మధ్య చర్చ జరిగింది. ప్రధానంగా మూడు డిమాండ్లను సీజేపీ కేంద్రం ముందుంచింది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు నీట్ పేపర్ లీక్తో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, విద్యార్థులపై ఎఫ్ఐఆర్లు నమోదు చేయొద్దని సీజేపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీ ఆరోపణలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే సీజేపీ ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు.ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు లభించడంతో లడఖ్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్చుక్ తన నిరాహార దీక్షను విరమించినప్పటికీ, ఆ నిర్ణయంతో తమకు సంబంధం లేదని సీజేపీ నేతలు తేల్చి చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి వైదొలిగే వరకు తమ ధర్నా కొనసాగుతుందని వారు వెల్లడించారు. ఈ క్రమంలోనే శుక్రవారం కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, ఇతర ఉన్నతాధికారులతో సీజేపీ ప్రతినిధులు రెండో విడత చర్చలు జరపనున్నారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో దేశవ్యాప్తంగా ఈ అంశం హాట్ టాపిక్ యింది. ముఖ్యంగా దేశ రాజకీయాలు సైతం దీని చుట్టే తిరుగుతున్నాయి. పార్లమెంటులోనూ నీట్ పేపర్ లీక్పై చర్చ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు వాంగ్ చుక్ దీక్ష కొనసాగుతున్న క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా రంగంలోకి దిగి లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యువత భవిష్యత్తును కాలరాసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, అందుకోసం పేపర్ లీక్లకు వ్యతిరేకంగా బిల్లు తెస్తున్నట్లు గురువారం అర్ధరాత్రి ఓ వీడియోలో తెలిపారు. పేపర్ లీక్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు నరకప్రాయంగా ఉంటుందని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రీఎగ్జామ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఫాస్ట్ కోర్ట్ ఏర్పాటు చేసి విచారణ జరుపుతామని అంతకుముందే మోదీ కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఓ ఫాస్ట్ ట్రాక్ కోర్టును సైతం నోటిఫై చేసింది. మరోవైపు, ఈ అంశంపై 26 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ గురువారం అర్ధరాత్రి దీక్ష విరమించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్లు హాస్పిటల్కు వెళ్లి కేంద్రం తీసుకుంటున్న చర్యలను, ప్రధాని మోదీ ప్రకటనను వివరించి, విజ్ఞప్తి మేరకు మేదాంత ఆసుపత్రిలో తన దీక్షను విరమించి నిమ్మరసం తాగారు. దేశంలో హింస చెలరేగకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాంగ్చుక్ తెలిపారు. కేంద్రం తమ డిమాండ్లు, సమస్యలపై చర్చలు జరపాలని కోరారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ లీకేజీ కేసులపై వేగవంతమైన విచారణ జరిపేందుకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్ట ప్రాంగణంలో స్పెషల్ ఫాస్ట్ట్రాక్ కోర్టును నోటిఫై చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కోర్టుకు న్యాయాధికారిగా జస్టిస్ అను గ్రోవర్ను నియమించారు. దీంతో పాటు విద్యాశాఖలో ప్రక్షాళన చేపడుతూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేసి, ఆయన స్థానంలో నరేశ్ గంగ్వార్ను నియమించారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగా టీకే అనిల్ కుమార్ను నియమించారు. వినీత్ జోషి గతంలో ఎన్టీఏ డైరెక్టర్ జనరల్గా, సీబీఎస్ఈ చైర్మన్గా వ్యవహరించారని తెలిసిందే.నీట్ సహా ఇతర ఎగ్జామ్ పేపర్ల లీక్, సీబీఎస్ఈ ఎగ్జామ్ నిర్వహణలో లోపాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. ప్రధాని హామీని, జేపీ నడ్డా ఆహ్వానాన్ని తిరస్కరించిన సీజేపీ నాయకులు.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ చేసిన ప్రకటనలతో దిగొచ్చిన సీజేపీ నేతలు శుక్రవారం మధ్యాహ్నం ఒక తటస్థ వేదికపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపేందుకు అంగీకరించారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్కు, జిల్లా కేంద్రాల్లో నిరసనలకు సీజేపీ నేతలు పిలుపునిచ్చారు. ఈ ఉద్యమానికి రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు కొందరు మద్దతు తెలిపారు. విద్యార్థుల జీవితాలు ముఖ్యమని, చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.మరోవైపు, ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు రాహుల్ గాంధీ నివాసంలో సమావేశమై తమ తదుపరి ప్లాన్ రెడీ చేసుకున్నారు. అనంతరం వారు పాదయాత్రగా హోం మంత్రి అమిత్ షా ఇంటి వైపు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నీట్ లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు గాంధీ స్మృతి వద్ద నివాళులర్పించారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్లో ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే కూడా విద్యార్థులకు మద్దతుగా 2 గంటల పాటు మౌన దీక్ష చేపట్టారు. ఓవైపు సోనమ్ వాంగ్ చుక్ దీక్ష విరమించడం, మరోవైపు సీజేపీ నేతలతో కేంద్రం చర్చలు జరపనుండటం శుభపరిణామంగా చెప్పవచ్చు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

శనివారం, జులై 25, 2026

కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

- ఎడిటర్

సెక్షన్ 8 మైక్రోఫైనాన్స్ సంస్థల (MFIs) కోసం ప్రత్యేకక్రెడిట్ రిజిస్ట్రీని రికార్డెంట్ స్థాపించింది.

హైదరాబాద్, 24 జూలై 2026: ప్రముఖ క్రెడిట్ రిస్క్ మరియు వసూళ్ల(కలెక్షన్స్) ప్లాట్‌ఫారమ్ అయిన రికార్డెంట్, క్రెడిట్ సమాచారదృశ్యమానతను మెరుగుపరచడం మరియు రిస్క్ అంచనాలనుబలోపేతం చేయడం కోసం సెక్షన్ 8 మైక్రోఫైనాన్స్ సంస్థల (MFIs) కోసం ప్రత్యేక క్రెడిట్ రిజిస్ట్రీని ప్రారంభించింది.

ఎంఎఫ్ఐ క్రెడిట్ రిజిస్ట్రీ ద్వారా భాగస్వామ్య సంస్థలు ఒకే వేదికపైరుణగ్రహీతల రుణ సంబంధిత సమాచారాన్ని పంచుకోవడంమరియు పొందడం సాధ్యమవుతుంది. దీనివల్ల రుణదాతలురుణాల మంజూరు ప్రక్రియను (అండర్‌రైటింగ్) మెరుగుపరచడం, రుణగ్రహీతల అప్పుల స్థాయిని పర్యవేక్షించడం మరియు మరింతసమాచారంతో కూడిన క్రెడిట్ నిర్ణయాలు తీసుకోవడంచేయగలుగుతారు.

మైక్రోఫైనాన్స్ రంగం అంతటా క్రెడిట్ సమాచార భాగస్వామ్యాన్నిమరియు రిస్క్ అంచనా ప్రక్రియలను మరింత బలోపేతం చేసేప్రయత్నాల నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించబడింది.ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ డేటా మరియు క్రెడిట్ అనలిటిక్స్ సంస్థఅయిన జునబఅటుఱఅ ప్రచురించిన Microfinance Insights Report (ఫిబ్రవరి 2026) ప్రకారం, మైక్రోఫైనాన్స్ రంగంలో మొత్తం బకాయిరుణాల పోర్ట్‌ఫోలియో విలువ రూ. 3.2 లక్షల కోట్లుగా ఉండగా, 10.5 కోట్ల క్రియాశీల రుణ ఖాతాలు నమోదయ్యాయి.

లాభాపేక్షలేని (నాట్-ఫర్-ప్రాఫిట్) మైక్రోఫైనాన్స్ సంస్థల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఈ రిజిస్ట్రీ, భాగస్వామ్యసంస్థలు రుణగ్రహీతల సమాచారాన్ని అప్‌లోడ్ చేయడానికిమరియు పొందడానికి వీలు కల్పించే ఉమ్మడి క్రెడిట్ సమాచారమౌలిక వసతిగా పనిచేస్తుంది. అలాగే, ఈ సమాచారాన్ని క్రెడిట్బ్యూరోల నుంచి లభించే వివరాలతో సమన్వయం చేసి, ఒకే సమగ్రక్రెడిట్ నివేదిక (యూనిఫైడ్ క్రెడిట్ రిపోర్ట్) రూపంలో అందిస్తుంది.

ఈ ప్లాట్‌ఫారమ్, సెక్షన్ 8 మైక్రోఫైనాన్స్ సంస్థలు ఎదుర్కొంటున్న క్రెడిట్ సమాచార దృశ్యమానత (క్రెడిట్విజిబిలిటీ) సంబంధిత కీలక నవాలును పరిష్కరించడంలోసహాయపడుతుంది. రుణగ్రహీతల మొత్తం అప్పు భారం(బారోయర్ ఎక్స్‌పోజర్) మరియు తిరిగి చెల్లింపు ప్రవర్తనపై సమగ్రఅవగాహన పొందేందుకు రుణదాతలకు ఇది అవకాశంకల్పిస్తుంది. అలాగే, భాగస్వామ్య ఎంఎఫ్ఐల మధ్య క్రెడిట్ చరిత్రడేటాను పరస్పరం పంచుకోవడం ద్వారా రుణగ్రహీతల తిరిగిచెల్లింపు చరిత్రలను సమీకరించి, వారి గురించి మరింతఖచ్చితమైన మరియు సమగ్ర ప్రొఫైల్‌ను అందిస్తుంది.

మైక్రోఫైనాన్స్ సంస్థల కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన స్వీయ నియంత్రణ సంస్థ అయిన Sa-Dhan తో చర్చించి, రికార్డెంట్ ఇప్పటికే నిర్వహిస్తున్న 2; (B2B) క్రెడిట్రిజిస్ట్రీ ప్లాట్‌ఫారమ్ నిర్మాణాన్ని ఆధారంగా తీసుకుని ఈరిజిస్ట్రీని అభివృద్ధి చేశారు. ఈ రిజిస్ట్రీ ద్వారాబాధ్యతాయుతమైన రుణాల మంజూరును (Responsible Lending) ప్రోత్సహించడం, అలాగే మైక్రోఫైనాన్స్ రంగం మొత్తంమీద రిస్క్ నిర్వహణను మరింత మెరుగుపరచడం లక్ష్యంగాపెట్టుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం Sa-Dhan సభ్య సంస్థలకు పరిచయంచేస్తున్నారు. సా-ధన్ నెట్‌వర్క్‌లో సెక్షన్ 8 మైక్రోఫైనాన్స్ సంస్థలు(MFIs) గణనీయమైన సంఖ్యలో ఉన్నందున, ఈ క్రెడిట్ రిజిస్ట్రీకివిస్తృత స్థాయిలో సంస్థాగత భాగస్వామ్యం మరియుపరిశ్రమవ్యాప్త సహకారం లభించే అవకాశం ఉంది. దీంతో, మైక్రోఫైనాన్స్ రంగంలో క్రెడిట్ సమాచార భాగస్వామ్యం మరింతబలోపేతం కావడంతో పాటు, రుణాల మంజూరు మరియు రిస్క్నిర్వహణ ప్రక్రియలు కూడా మరింత సమర్థవంతంగామారనున్నాయి.

న్యాయమైన మరియు పారదర్శక రుణాల మంజూరునునిర్ధారించడం ద్వారా ఆర్థిక చేర్చుకోవడం (ఫైనాన్షియల్ఇన్‌క్లూజన్)ను బలోపేతం చేయడమే కాకుండా, మైక్రోఫైనాన్స్సంస్థలు (MFIs) మరియు సంబంధిత సంస్థల రిస్క్ నిర్వహణనుకూడా మెరుగుపరచడానికి ఈ రిజిస్ట్రీ సహాయపడుతుందనిభావిస్తున్నారు. Recordent ఈ కార్యక్రమం రుణగ్రహీతలు మరియురుణదాతలు ఇద్దరికీ ప్రయోజనం కలిగించేలా, మరింత స్థిరమైనమరియు సుస్థిరమైన రుణ వ్యవస్థను రూపొందించడంలో ఇదిసహాయపడగలదని నమ్ముతోంది

నూతన అదనపు కలెక్టర్ ను సన్మానించిన జిల్లా టీఎన్జీవో నాయకులు ...

తెలంగాణ పవర్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జూలై 24) : నాగర్ కర్నూల్ జిల్లాకు నూతనంగా వచ్చిన అదనపు కలెక్టర్ చెన్నయ్య గారిని, జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు బావాండ్ల వెంకటేష్, కార్యదర్శి షర్ఫుద్దీన్ కార్యాలయంలో శాలువలతోఘనంగా సన్మానించారు.జిల్లా ప్రజలకు పెరుగైన సేవలు అందించుటలో ఉద్యోగులు తోడ్పాటు కావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్,కార్యదర్శి షర్ఫుద్దీన్,ఉపాధ్యక్షులు చెన్నకేశవులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,నాగర్ కర్నూల్ యూనిట్ అధ్యక్షులు నసిరుద్దీన్,కార్యదర్శి సురేష్ కుమార్,మహిళా నాయకులు అలివేలు,అరుణ,మరియు రామకృష్ణ, సుదర్శన్, బుగ్గప్ప,నాగయ్య,రాకేష్ కన్నా, తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మత్స్యకారుల అభివృద్ధికి డిజిటల్ బాట
మత్స్య సహకార సంఘాలు, ూన+ స్వయం సహాయక బృందాల అపూర్వ స్పందన
మత్స్య సొసైటీ అధ్యక్షులు: జంగం నాగరాజు



తెలంగాణ పవర్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జులై 24): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం గ్రామీణ మత్స్యకారుల జీవన విధానం, వారి ఆర్థిక ప్రగతికి తొలి ప్రాధాన్యతనిస్తూ నిర్విరామంగా కృషి చేస్తుందని వెన్న చర్ల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు జంగం నాగరాజు అన్నారు.

ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం వెన్న చర్ల గ్రామంలో శుక్రవారం సొసైటీ భవనం నందు మత్స్యకారులను ఉద్దేశించి అధ్యక్ష కార్యదర్శులు జంగం నాగరాజు, జంగం శేఖర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా" ఒకే గుర్తింపు ఒకే వేదిక బహుళ ప్రయోజనాలు "చీఖీణూ నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫామ్ ద్వారా మత్స్యకారుల అభివృద్ధికి డిజిటల్ బాట సులభతరంగా అర్థవంతంగా, ఉపయోగకరంగా ఉన్నదని, సొసైటీ లో ఉన్న సభ్యుల తో పాటు సభ్యత్వం లేని వారు కూడా 20 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలలందరు చీఖీణూ లో ఎన్రోల్మెంట్ చేసుకోవడానికి అవకాశం ఉన్నదని అన్నారు.మత్స్య సహకార సంఘాలు, ూన+ స్వయం సహాయక బృందాలు, చేపల ఉత్పత్తిదారులు, విక్రయదారులు, సంస్థలకు మేలు చేకూరుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

డిజిటల్ గుర్తింపు ద్వారా" రిజిస్ట్రేషన్ అనంతరం ప్రతి మత్స్యకారునికి ప్రభుత్వ గుర్తింపు పొందిన చీఖీణూ గుర్తింపు సర్టిఫికెట్ తక్షణమే అందించడం ఉపయోగకరమన్నారు.

ప్రతి మత్స్యకారునికి "ఆర్థిక సహాయం బ్యాంకు రుణాలు " బ్యాంకు రుణాలు సులభంగా, సంస్థాగత రుణాలు, మరియు కిసాన్ క్రెడిట్ కార్డ్ లభ్యత కూడ చేకూరును. అక్వి కల్చర్ బీమా సదుపాయం, ప్రమాద భీమా, సాంకేతిక శిక్షణఅందించడం చీఖీణూ యొక్క ప్రయోజనాలను సభ్యులకు సూచించారు. తద్వారా మత్స్యకారుల నుండి అపూర్వమైన స్పందనతో సభ్యులు ఎన్రోల్మెంట్ అధిక సంఖ్యలు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు గడ్డి గోపుల సలేశ్వరం, కమిటీ పెద్దలు డబ్బా లింగన్న, పెద్ద మశన్న, గేరినాగులు, డబ్బా పర్వతాలు, మహిళా మత్స్యకారులు బేబీ, ఎల్లమ్మ వెంకటమ్మ, మహిళా సభ్యులు,కమిటీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

టీ.జీ .ఎంసెట్ లో 2684వ ర్యాంకు సాధింపు

జే ఎన్ టి యు లో సీటు పొందిన గజ్జి వర్షిత
అభినందించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు

తెలంగాణ పవర్ న్యూస్ వలిగొండ యాదాద్రి జూలై మండల పరిధిలో ఒక మారుమూల ప్రొద్దుటూరు గ్రామంలోని పుట్టి పెరిగిన గజ్జి వర్షిత ఉన్నత చదువుల కొరకు హైదరాబాదులోని ఇంటర్మీడియట్ చదివి పూర్తిచేసి ఎస్. కె అకాడమీ ఎంసెట్ కోచింగ్ సెంటర్ లో 45 రోజులు ఉత్తమ బోధకులచే విద్యను అభ్యసించి టీ.జీ ఎంసెట్ 2026 ఫలితాలలో అత్యంత ప్రతిభ కనబరిచి 2684 వ ర్యాంకు సాధించి మొదటి కౌన్సిలింగ్ లో జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు పొందడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు చాలా గర్విస్తూ ఆనందోత్సవంతో అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభకు స్థాయి, అంతస్తు ,హెూదా ఇవే ముఖ్యం కాదని సాధించాలనే తపన ,ఆకాంక్ష, పట్టుదలతో ఎంతటి విజయానైనా సాధించి పెడతాయని నిరూపించిన విద్యార్థిని గజ్జి వర్షిత ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తి ప్రేరణగా తీసుకొని తమ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాము ర్యాంకు సాధించి తల్లిదండ్రులకే కాకుండా గ్రామానికి, మండలానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు తెచ్చిందని మునుముందు ఎన్నో ర్యాంకులు సాధించాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆ భగవంతుని ఆశీస్సులు, కృప ఎల్లప్పుడూ ఉండాలని వారన్నారు వర్షిత మాట్లాడుతూ జవహర్ లాల్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధించినందుకు చాలా సంతోషంగా ఉన్నది అని జే ఎన్ టి యూ క్యాంపస్ లో ఇంజనీరింగ్ సీటు రావడం అంటే విద్యార్థులకు ఒక గొప్ప వరం అని అద్భుతమైన విద్య నాణ్యత , అత్యాధునిక ఇంజనీరింగ్ విద్యకు అగ్రగామిగా కాలేజీలో చేరడం అందరికీ కొత్త అనుభూతిని అందిస్తుందని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు గజ్జి గంగారామ్, కోటి, లడ్డు ఉపాధ్యాయులు గ్రామస్తులు కుటుంబ సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు



ఎంబీటికి కాంగ్రెస్ సపోర్ట్...

హైదరాబాద్, జూలై 24, (న్యూస్ పల్స్)గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో భాగ్యనగర రాజకీయాలు, ముఖ్యంగా పాతబస్తీ వేదికగా సరికొత్త మలుపు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీకి తిరుగులేని కోటగా ఉన్న పాతబస్తీలో ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఒక ఆసక్తికరమైన పొలిటికల్ ఈక్వేషన్ తెరపైకి వచ్చింది. ఎంఐఎంను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక మజ్లిస్ బచావో తెహ్రీక్ తో చేతులు కలిపి ఉమ్మడి కూటమిగా బరిలోకి దిగే ప్రయత్నాలు చేస్తోంది. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల పరిధిలోని మున్సిపల్ డివిజన్లు ఎప్పుడూ ఎంఐఎంకు ఏకపక్ష విజయాలను అందిస్తూ వచ్చాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈసారి పాతబస్తీని నామమాత్రంగా వదిలేయడానికి సిద్ధంగా లేదు. ఎంఐఎం వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చకుండా, పాతబస్తీ గల్లీల్లో బలమైన క్యాడర్ ఉన్న ఎంబీటీ తో అధికారిక లేదా అనధికారిక అవగాహనకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. బహదూర్‌పురా, యాకుత్‌పురా వంటి డివిజన్లలో ముస్లిం మైనారిటీ ఓటర్ల విభజనను నిరోధించి, ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ఎంఐఎంకు చమటలు పట్టించాలని కాంగ్రెస్ స్థానిక నాయకత్వం భావిస్తోంది.పాతబస్తీలో ఎంఐఎంకు సైద్ధాంతికంగా, రాజకీయంగా గట్టి పోటీ ఇచ్చే ఏకైక స్థానిక శక్తి 'మజ్లిస్ బచావో తెహ్రీక్' . అమన్ నగర్, యాకుత్‌పురా, చంచల్‌గూడ వంటి పాకెట్స్‌లో ఎంబీటీకి ఇరవై ముప్పై ఏళ్లుగా చెక్కుచెదరని వాలంటీర్ నెట్‌వర్క్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి పాతబస్తీలో నాయకత్వం ఉన్నప్పటికీ, గల్లీ స్థాయి బూత్ మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండేది. ఇప్పుడు ఎంబీటీ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ తనతో కలుపుకోవడం ద్వారా, ఎంఐఎం కోటలోని లూప్‌హోల్స్‌ను సులభంగా టార్గెట్ చేయగలుగుతోంది. ముఖ్యంగా మైనారిటీలలోని మతపరమైన సెంటిమెంట్ల కంటే, స్థానిక సమస్యలపై ఎంబీటీ చేసే పోరాటాలు కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మైలేజ్ ఇస్తున్నాయి.ఈసారి పాతబస్తీ ఎన్నికల సరళిలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు.. అక్కడి యువత ఆలోచనా విధానం. దశాబ్దాలుగా కేవలం భావోద్వేగాలు, మతపరమైన సెంటిమెంట్ల ఆధారంగానే పాతబస్తీలో ఓటింగ్ జరుగుతూ వచ్చింది. కానీ, చదువుకున్న నేటి తరం యువత మా గల్లీ పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తోంది. నిరంతరం పొంగిపొర్లే డ్రైనేజీలు, కలుషిత తాగునీటి సరఫరా, వర్షం వస్తే మునిగిపోయే రోడ్లు, ఉపాధి అవకాశాల లేమి వంటి మౌలిక సమస్యలపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఐటీ కారిడార్ ఉన్న హైటెక్ సిటీ అభివృద్ధిని, తమ పాతబస్తీ వెనుకబాటుతనాన్ని పోల్చి చూసుకుంటున్న యువత.. ఈసారి మార్పు వైపు మొగ్గు చూపే సంకేతాలు గల్లీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని కొన్ని డివిజన్లలో దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు నోచుకోలేదు. తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి లైన్లు కలిసిపోయి కలుషిత నీరు వస్తోందని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పౌర సమస్యలనే కాంగ్రెస్-ఎంబీటీ కూటమి తమ ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా మలచుకుంది.

మెదక్ కే పరిమితమౌతున్నహరీష్



మెదక్, జూలై 24, (న్యూస్ పల్స్) హరీష్ రావు సొంత నియోజకవకర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్‌గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపరచడానికి, అధినాయకత్వానికి-హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం

పార్టీలో రసవత్తరంగా చర్చ

చేస్తోంది.రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్దిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలివచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది.బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది.కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరా టాలకు నాయకత్వం వహించేలా ముందువరునలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

పట్టు కోసం కమలం బిగ్ ప్లాన్



హైదరాబాద్, జూలై 24, (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయ వేదికపై అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత వేగంగా పావులు కదుపుతోంది. సాంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, పూర్తిగా డేటా ఆధారిత కార్పొరేట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ సాఫ్రాన్ పేరుతో ప్రొఫెషనల్ ఎలక్షన్ ఏజెన్సీలను క్షేత్రస్థాయిలోకి దించనుంది. రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ముమ్మరంగా గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది.గత అనుభవాలు, ఎన్నికల పలితాలను విశ్లేషించిన బీజేపీ హైకమాండ్, ఈసారి ముగ్గురు కీలక నేతల మార్గదర్శకంలో మూడు ప్రత్యేక ప్రొఫెషనల్ ఏజెన్సీలను రంగంలోకి దించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఇందులో మొదటిది అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్. హోంమంత్రి అమిత్ షా నేరుగా పర్యవేక్షించే ఈ సంస్థ, గత కొన్ని నెలలుగా తెలంగాణలో పార్టీ పొలిటికల్ ఎజెండా, ప్రచార వ్యూహాలను నిశితంగా రూపొందిస్తోంది. ఇక రెండోది జార్విస్. సాంకేతికత, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ ఏజెన్సీ దృష్టి సారించింది. భారీ కాల్ సెంటర్ల నిర్వహణ ద్వారా నియోజకవర్గాల్లోని ఓటర్లను నేరుగా సంప్రదించడం, ప్రజల అభిప్రాయాలను సమీకరించడం, బూత్ కమిటీల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను చూస్తోంది. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలు, నాయకుల నిర్వహణ కోసం రూపొందించిన 'సరళ్ యాప్' బాధ్యతలను కూడా జార్విస్ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇక మూడోది అభీష్ట టీమ్. పశ్చిమ బెంగాల్, బిహార్ ఎన్నికలలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, మెరుగైన ఫలితాలను అందించిన 'అభీష్ట' ప్రొఫెషనల్ ఏజెన్సీని తాజాగా తెలంగాణకు రప్పించారు. ఈ టీమ్ బి.ఎల్.సంతోష్ పర్యవేక్షణలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు లోతైన అధ్యయనం చేస్తోంది.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు 'అభీష్ట' బృందం ప్రస్తుతం 'సర్' అంటే స్టడీ, అండర్ స్టాండ్, రిపోర్ట్ ప్రక్రియను చేపట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా ఉంది? బూత్ లెవెల్ ఏజెంట్లు సరిగ్గా పనిచేస్తున్నారా? అనే అంశాలపై నివేదికలను ఎప్పటికప్పుడు ఢిల్లీ అధిష్టానానికి అందిస్తోంది.ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపును ప్రభావితం చేయగల 50 నుంచి 100 మంది ప్రముఖ వ్యక్తుల జాబితాను ఈ టీమ్ సిద్ధం చేస్తోంది. ఇందులో రాజకీయ నేతలతో పాటు సమాజంలో మంచి పేరున్న వ్యాపారవేత్తలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులను గుర్తిస్తున్నారు. వీరిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీ విజయంలో వీరి మద్దతును వినియోగించుకోవడంపై ప్రణాళికలు రచిస్తున్నారు.కేవలం కేంద్ర నాయకత్వపు నివేదికలపైనే ఆధారపడకుండా, ఈ ఏజెన్సీలకు లోకల్‌గా అవసర మైన సహాయ సహకారాలు అందించడానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల నుంచి శిక్షణ పొందిన వాలంటీర్లను నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పక్కాగా అసెస్ చేసి, దానిని ఓట్లుగా మార్చుకునేందుకు స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇతర పార్టీలలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులను చేర్చుకోవడంలోనూ ఈ ఏజెన్సీల గ్రౌండ్ రిపోర్టులు మార్గదర్శకంగా నిలవనున్నాయి. మొదటగా జీహెచ్ ఎంసీ పరిధిలోని ఓటర్ల నాడిని పట్టుకుని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార సరళి వరకు బ్యాక్ ఎండ్ నుంచి నడిపించేందుకు సిద్ధమయ్యారు.కేవలంస్థానిక నాయకత్వ బలంపైనే ఆధారప డకుండా, ఇటువంటి ఆధునిక డేటా విశ్లేషణ, కార్పొరేట్ తరహా ఎలక్షన్ మేనేజ్ మెంట్ పద్ధతులు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

అవకాశవాద రాజకీయం చేస్తోన్న కాంగ్రెస్

బీజేనా నేత వినుకొల్లు చక్రవర్తి

ములుగు ,విద్యార్థుల సమస్యల కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేస్తోందని బీజేపీ పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆరోపించారు. మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. నీచమైన రాజకీయాలతో కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని చక్రవర్తి విమర్శించారు. ఢిల్లీలో ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అరాచక మూకల్లా వ్యవహరించాయని, ఒకవైపు దేశ రాజధానిలో విధ్వంసాలు సృష్టిస్తూ, మరోవైపు రాష్ట్రంలో పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడడం కాంగ్రెస్ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ విధ్వంసాలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించారు.


కేటీఆర్ జన్మదిన వేడుకలు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కరీంనగర్ జూలై 24 బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లాలో గులాబీ శ్రేణులు నిరాడంబరంగా సేవా కార్యక్రమాలతో నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు రేగుర్తి బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ పంపిణీ చేశారు. మార్కెట్ రోడ్డులో ప్రత్యేక పూజలు, అల్పాహార వితరణ, హుస్సేనీపురా మదర్సాలో సుమారు 150 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నుల పంపిణీతో పాటు 33వ డివిజన్ అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు పలకలు, బలపాలు, కంపాస్ బాక్సులు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అమిత్ షా టూర్ పై రసవత్తర చర్చ

హైదరాబాద్, జూలై 24, (న్యూస్ పల్స్)కేంద్ర మంత్రి బీజేపీకి అన్ని విధాలుగా మార్గదర్శకుడు అయిన అగ్ర నేత అమిత్ షా తాజాగా చేపట్టబోతున్న తెలంగాణా పర్యటన రాజాకీయ వర్గాలలో ఆసక్తిని పెంచుతోంది. ఈ ఆదివారం అంటే 26వ తేదీన అమిత్ షా తెలనగణా పర్యటన పెట్టుకున్నారు. ఈ బీజేపీ అగ్రనేత పర్యటనలో భాగంగా ఒక బీఆర్ఎస్ నాయకుడి కళాశాలను సందర్శించడమే ఇపుడు హాట్ పొలిటికల్ టాపిక్ అయింది. దీంతో అనేక రకాలుగా రాజకీయ ఊహాగానాలకు ఈ పరిణామం తెర లేపింది అని అంటున్నారు. బీఆర్ఎస్ బీజేపీ రెండూ ఒక్కటే అని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేలా అమిత్ షా తాజా టూర్ ఉండబోతోందా అని కూడా ఆలోచిస్తున్నారు ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కి చెందిన కీలక నేత బోయినపల్లి శ్రీనివాసరావుకు ప్రతిమ మెడికల్ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి రజతోత్సవ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇక అమిత్ షా పర్యటన చూస్తే కేవలం కాలేజ్ ఉత్సవాలకే హైదరాబాద్ వచ్చి



మళ్ళీ అటునుంచి అటే ఢిల్లీకి వెళ్ళిపోతున్నారని అంటున్నారు. పైగా అదే కాలేజీలో అమిత్ షా మధ్యాహ్న భోజనం చేస్తారని అంటున్నారు. ఒక విధంగా అమిత్ షా వస్తున్నది బీఆర్ఎస్ నేత కార్యక్రమం వారి ఆతీధ్యం స్వీకరించడానికే కావడంతో తెలంగాణా రాజకీయాలు దీని మీదనే హీటెక్కిపోతున్నాయి.ఇంతకీ ఈ బోయినపల్లి శ్రీనివాసరావు ఎవరు అంటే బీఆర్ఎస్ ఎంపీ బి. వినోద్ కుమార్ కి సోదరుడు అని చెబుతున్నారు అని చెబుతున్నారు. వినోద్ కుమార్ బీఆర్ఎస్ లో అతి ముఖ్య నేత. గతంలో ఎంపీగా పనిచేసిన నాయకుడు. దాంతో పాటు కేసీఆర్ కి సన్నిహిత నేత కావడ మరో విశేషం. మరి అంతటి నేత కుటుంబం నిర్వహించే వైద్య కళాశాల వేడుకకు అమిత్ షా వంటి బీజేపీ ఉద్దండుడు వస్తున్నారు అంటే రాజకీయ సమీకరణలు మలుపు తిప్పే సంఘటనగానే చూస్తున్నారు.ఇక బీజేపీ బీఆర్ఎస్ కలవవు అని ఎన్ని చెప్పినా తెలంగాణా రాజకీయం చూస్తే అది అనివార్యం అనిపిస్తుంది అని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉంది. విపక్షాలు రెండుగా చీలి 2028లో పోటీకి దిగితే కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీ ఎంత ఉన్నా ఓట్లు అన్నీ అటూ ఇటుగా చీలిపోతాయి. అపుడు కాంగ్రెస్ కే లాభం అని అంటున్నారు. ఈ విషయం రాజకీయంగా ధక్కామెక్కీలు తిన్న బీజేపీకి బీఆర్ఎస్ కి తెలియనిది కాదు కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే బీఆర్ ఎస్ కి ఈసారి ఎన్నికలు చావో రేవో అన్నట్లుగానే ఉంటాయని అంటున్నారు. రెండోసారి వరుసగా ఓటమి పాలు అయితే కనుక బీఆర్ఎస్ ఎన్నడూ లేనంతగా రాజకీయ సంక్షోభంలో పడుతుంది అని అంటున్నారు. అది బీఆర్ఎస్ సమస్య అయితే బీజేపీకి చూస్తే కాంగ్రెస్ ఎక్కడా ఎదగకూడదు అన్నదే గట్టి సంకల్పం అని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్ కనుక రాష్ట్రాలలో బలపడి ఎక్కువగా ఎంపీ సీట్లు సాధిస్తే అది జాతీయ స్థాయిలో బీజేపీ అధికారానికి ముప్పు అని అంటున్నారు. అందుకే తాము నేరుగా కట్టడి చేయాల్సిన చోట కట్టడి చేస్తూ లేని చోట్ల మాత్రం మిత్రులను వెతుక్కుని మరీ కాంగ్రెస్ కి బ్రేకులు వేసే వ్యూహాలు బీజేపీ అమలు చేస్తోంది. ఈ విధంగా రాజకీయ విశ్లేషణలు చూసినపుడు బీఆర్ ఎస్ బీజేపీ కలసి పోటీ చేయబోవని అనుకోవడానికి వీలు లేదని అంటున్నారు. అయితే రాజకీయాల్లో వ్యూహాలు అన్నీ సమయానుకూలంగా బయటకు వస్తాయని అంటున్నారు. మరో వైపు చూస్తే బీజేపీ మీద నేరుగా విమర్శలు చేయడాన్ని బీఆర్ఎస్ తగ్గించిందని కూడా విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తం మీద అయితే తెలంగాణాలో అమిత్ షా టూర్ ఆసక్తిని పెంచేస్తోంది.

పావురాలకు మేత వేయడంపై ఆంక్షలు

హైదరాబాద్, జూలై 24, (న్యూస్ పల్స్)హైదరాబాద్, సికింద్రాబాద్ కవల నగరాల పరిధిలో పావురాలకు విచ్చలవిడిగా మేత వేయడం వల్ల ప్రజా ఆరోగ్యం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణలో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం మేత నియంత్రణకు తీసుకున్న చర్యలపై మూడు వారాల్లో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనావాసాలు, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల సమీపంలో పావురాలకు మేత వేయడాన్ని క్రమబద్ధీకరించాలని దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేసింది. అయితే వాటికి మేత వేయటం వల్ల నష్టాలేంటి..? పావురాల అంత ప్రమాదకరమా..? ఆ విషయాలు తెలుసుకుందాం.హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం (జులై 22) ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసిందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మె?దలైంది. అవి అంత ప్రమాదకరమా..? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. నగరాల్లో ఆహారం సులభంగా దొరకడం వల్ల పావురాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరిగి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. ఆహార వ్యర్థాలు నేలపై పడి కుళ్ళిపోవడంతో పాటు పావురాల రెట్టలు భవనాలను దెబ్బతీస్తూ గాలిలో కలిసే ప్రమాదకర క్రిములకు నిలయంగా మారుతున్నాయి. పావురాల ఈకలు, ఎండిపోయిన రెట్టల నుంచి వచ్చే ధూళి గాలిలో కలవడం వల్ల మానవులకు తీవ్రమైన శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయట.ముఖ్యంగా పావురాల సావాసం వల్ల హైపర్ సెన్సిటివిటీ ప్యానెమోనైటిస్ అనే అలెర్జీ వచ్చి అది కాలక్రమేణా ఊపిరితిత్తులను శాశ్వతంగా దెబ్బతీసే లంగ్ ఫైబ్రోసిస్‌కు దారితీస్తుందని చెబుతున్నారు. అలాగే వీటి ద్వారా వ్యాపించే సిట్టకోసిస్ అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి, న్యుమోనియా వంటి సమస్యలు వస్తాయట. వీటి రెట్టలలో పెరిగే ఫంగస్ కారణంగా హిస్టోప్లాస్మోసిస్, క్రిప్టోకోకోసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చి ఊపిరితిత్తులతో పాటు నరాల వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులకు ఈ ధూళి వల్ల శ్వాసకోశ అలెర్జీలు మరింత ఎక్కువవుతాయని చెబుతున్నారు.

వొడితల రాజేశ్వర్ రావు వర్ధంతి

ఆయన సేవలు భావి తరానికి మార్గదర్శకం

హుజురాబాద్, రాజ్యసభ సభ్యుడిగా,రాజకీయాల్లో ప్రభుత్వం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఆనాటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు చేదోడువాదోడుగా ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో కీలక కృషి చేసిన మహానుభావుడు వొడితల రాజేశ్వర్ రావు అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం నాడు ఆయన వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ప్రణవ్.ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు,ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.హుజూరాబాద్ పార్టీ కార్యాలయంలో ఇంచార్జి ప్రణవ్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి రాజేశ్వర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష ఉండకూడదని విద్యాసంస్థలను నెలకొల్పి వారికి ఉచిత విద్యను అందించారని,ఈ ప్రాంత బిడ్డగా నియోజకవర్గానికి సంబంధించి అనేక అభివృద్ధి పనులు రాజ్యసభ సభ్యుడిగా చేశారని,ఇప్పటికీ వారి అభివృద్ధి ఆనవాళ్లు ఇంకా ఉన్నాయని అన్నారు.వారు చూపిన బాటలో ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రణవ్ అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,దేవాలయాల చైర్మన్లు,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,వార్డ్ సభ్యులు,బ్లాక్ కాంగ్రెస్,బీసీ ఎస్సీ,యువజన,సేవాదళ్,అనుబంధ సంఘాలు,సోషల్ మీడియా,యూత్ కాంగ్రెస్, మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిమాయత్ నగర్ లో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

హైదరాబాద్,ఢిల్లీలో రాహుల్ గాంధీ పై దాడిని, విద్యార్థులపై లాఠీ చార్జీని, అరెస్టులను ఖండిస్తూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమాయత్ నగర్ కూడలి నుంచి హైదర్ గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హిమాయత్ నగర్ వై జంక్షన్ నుండి హైదర్ గూడ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. నీట్ పేపర్ లికేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం అడుతుందని ఆరోపించారు. ప్రశ్న పత్రాలను కాపాడలేని నాయకులు , దేశాన్ని ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థుల డిమాండ్ ను పరిగణలోకి తీసుకుని ధర్మేందర్ ప్రధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ధర్మేందర్ ప్రధన్ దిష్టిబొమ్మను దహనం చేసారు.

విద్యార్థులను దేశ శత్రువులుగా మోదీ ప్రభుత్వం పరిగణిస్తోందిః సోనియా గాంధీ



న్యూఢిల్లీ: నిరసన చేస్తున్న విద్యార్థులను దేశ శత్రువులుగా మోదీ ప్రభుత్వం పరిగణిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా జవాబుదారీతనం పట్ల ధిక్కారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్, ప్రతిపక్షాల నిరసన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. నీట్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనలు, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శిస్తూ సోనియా గాంధీ రాసిన ఒక ఆర్టికల్ 'ది హిందూ' పత్రికలో శుక్రవారం ప్రచురితమైంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, విద్యా సంస్కరణలను విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అయితే మోదీ ప్రభుత్వం వారి ధైర్యానికి పిరికితనంతో, విచక్షణారహిత క్రూరత్వంతో స్పందించిందని, విద్యార్థులను భవిష్యత్తు వారసులుగా కాకుండా దేశ శత్రువులుగా చూస్తోందని ఆరోపించారు.కాగా, జూలై 20న ఢిల్లీ పోలీసులు, సాయుధ పోలీస్ బలగాల లాఠీచార్జ్, బాష్పాయువు ప్రయోగం వంటి హింసాత్మక చర్యల ద్వారా విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వం 'అపఖ్యాతి పాలైన రోజు'గా సోనియా గాంధీ అభివర్ణించారు. కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది విద్యార్థి నిరసనకారులపై ప్రదర్శిస్తున్న 'క్రూరత్వం' ఈ ప్రభుత్వ హయాంలో కొత్తేమీ కాదన్నారు. '2020లో సీఏఏ-ఎన్ఆర్సీ వ్యతిరేక నిరసనల సమయంలో సాయుధ పోలీసులు, పారామిలిటరీ బలగాలు విశ్వవిద్యాలయ ప్రాంగణాలను ఎలా ధ్వంసం చేశాయో మనందరికీ స్పష్టంగా గుర్తుంది. భారత మహిళా రెజ్లర్లపై జరిగిన ఆమోదయోగ్యం కాని దురాగతాలను మన జ్ఞాపకాల నుంచి ఎప్పటికీ చెరిపివేయలేం' అని పేర్కొన్నారు.మరోవైపు విద్యార్థుల నిరసనలను బలహీనపరచడానికి, అసమ్మతిని దేశద్రోహంగా ముద్ర వేసే పాత 'సాధనాలను' కేంద్ర ప్రభుత్వం తిరిగి ఉపయోగించినట్లు సోనియా గాంధీ విమర్శించారు. నిరసనలకు దారితీసిన తన విధానాలపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన మోదీ ప్రభుత్వం, నిందలు వేయడానికి, కుట్రలను ప్రచారం చేయడానికి తన కుతంత్రాలన్నింటినీ ప్రయోగించిందని దుయ్యబట్టారు.భారతదేశ విద్యా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం క్షీణింపజేస్తోందని సోనియా గాంధీ విమర్శించారు. కేవలం నిరాశను మాత్రమే కలిగించే నేటి నిరాశాజనకమైన విద్యా వాతావరణం, మోదీ ప్రభుత్వానికి అలవాటైన అహంకారం, జవాబుదారీతనం లేదా నిర్మాణాత్మక వైఖరి లేకపోవడం అనే ఈ పరస్పర సంబంధిత శక్తుల సహజ పర్యవసానమే విద్యార్థుల నిరసనలని స్పష్టం చేశారు. దేశ విద్యార్థులు మోదీ ప్రభుత్వ బూటకపు మాటలను బట్టబయలు చేశారని పేర్కొన్నారు.కాగా, ప్రభుత్వ విద్య నుంచి మోదీ ప్రభుత్వం వెనకడుగు వేయడమే మొట్టమొదటి ప్రాథమిక సమస్య అని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యపై తన మొత్తం బడ్జెట్‌లో కేటాయించే వాటాను 50 శాతం, ఉన్నత విద్యపై 33 శాతం తగ్గించిందని విమర్శించారు. 'ఇంతటి అసంబద్ధమైన వెనకడుగులో ఎవరికైనా అర్థం కనిపిస్తుందా?' అని ప్రశ్నించారు.అలాగే గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, 43,000 ప్రైవేట్ పాఠశాలల ప్రారంభాన్ని పర్యవేక్షించిందని సోనియా గాంధీ ఆరోపించారు. వీటిలో అధిక భాగం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నడుస్తున్నాయని తెలిపారు. 'యాదృచ్ఛికంగా, ఈ సంస్థ తన అనుబంధ సంస్థలతో కలిసి భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ పాఠశాలల నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది' అని విమర్శించారు. నాణ్యమైన, సరసమైన ప్రభుత్వ విద్య అందుబాటులో లేకపోవడంతో దేశంలోని కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం సొంతంగా డబ్బు ఖర్చు చేయవలసి వస్తోందని పేర్కొన్నారు.అయితే ఎన్టీఏను బలోపేతం చేయాలన్న పార్లమెంటరీ విద్యా స్థాయీ సంఘం సిఫార్సులను, అందులో ప్రతిపక్ష సభ్యులు ఉన్నారనే ఏకైక కారణంతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బహిరంగంగా తోసిపుచ్చడం ద్వారా జవాబుదారీతనం పట్ల ధిక్కారాన్ని ప్రదర్శించారని సోనియా గాంధీ ఆరోపించారు. ఇన్ని ఘోర వైఫల్యాలు ఎదురైనా పదవికి రాజీనామా చేయడానికి ఆయన విముఖత చూపడం ప్రజాభిప్రాయాన్ని మరింత రెచ్చగొట్టిందని విమర్శించారు. విద్యార్థులకు అండగా నిలబడి, వారి భవిష్యత్తును కాపాడటం ఒక నైతిక, రాజకీయ, రాజ్యాంగపరమైన బాధ్యత అని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

రెండు డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉంది: సీజేపీ ప్రతినిధి



న్యూఢిల్లీ, నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత తీసుకోవాలంటూ పట్టుబడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు కొందరు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా వ్యవస్థలో కీలక అంశాలపై చర్చించారు. దాదాపు గంటన్నరపాటు ఈ చర్చలు జరిగాయి. తమ డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్ర మంత్రులు స్పందిస్తూ తమకు ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో, రేపు మరోసారి భేటీ అయ్యేందుకు ఇరు వర్గాలు నిర్ణయించాయి.కేంద్రం మంత్రులతో సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు 3 ప్రధాన డిమాండ్లు పెట్టామని సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ తెలిపారు. మూడింట్లో రెండు డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉందని అన్నారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని తాము కోరినట్టు చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి రేపటి వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు.

మరోసారి సీజేపీ నేతలతో చర్చిస్తాం: జేపీ నడ్డా

న్యూఢిల్లీ, జులై 24: కాక్రోచ్ జనతా పార్టీ నేతలతో భేటీ అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగాయని తెలిపారు. సీజేపీ నేతలు తమ ముందు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారని వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంపై రేపు(శనివారం) మధ్యాహ్నం మరోసారి వారితో చర్చలు జరుపుతామని అన్నారు.శుక్రవారం మధ్యాహ్నం కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కేంద్ర మంత్రులు, సీజేపీ నేతల మధ్య దాదాపు రెండు గంటలు చర్చలు జరిగాయి. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని.. అలా కాకపోతే ఆయనను పదవి నుంచి తొలగించాలని సీజేపీ నేతలు పట్టుబట్టారు.చర్చల అనంతరం సీజేపీ నేత అశుతోష్ రంక మీడియాతో మాట్లాడుతూ.. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం ఓ రోజు సమయం అడిగింది. ప్రభుత్వం ఆయనను త్వరగా విధులనుంచి తొలగిస్తుందని అనుకుంటున్నాము. కేంద్రం మా రెండు డిమాండ్లకు ఒప్పుకుంది. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వడానికి, విద్యార్థులపై కేసులను విత్ డ్రా చేసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది' అని తెలిపారు.



నిరాహార దీక్ష ఎందుకు విరమించానంటే.. సోనమ్ వాంగ్‌చుక్ కీలక ప్రకటన

కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ శుక్రవారం తన దీక్ష విరమించిన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమక్షంలో 26వ రోజు ఆయన నిరాహార దీక్ష విరమించారు. అయితే, ఆయన ప్రధాన డిమాండ్ అయిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే సోనమ్ దీక్ష విరమించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సోనమ్ వాంగ్‌చుక్ స్పందించారు. తాను ఎందుకు దీక్ష విరమించాల్సి వచ్చిందో వెల్లడించారు. '' నా దగ్గర రెండే దారులున్నాయి. ఒకటి నిరాహార దీక్ష కొనసాగించడం లేదా దీక్ష ముగించి ఉద్యమాన్ని కొనసాగించడం. వేలాది మంది నేను దీక్ష విరమించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. ప్రాణాన్ని పణంగా పెట్టడంకంటే ఉద్యమాన్ని కొనసాగించమే ముఖ్యమని చాలామంది సూచించారు. భవిష్యత్ పోరాటాల కోసం నేను జీవించి ఉండటం చాలా ముఖ్యం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయనంతమాత్రాన ఈ ఉద్యమం విఫలమైనట్లు కాదు. ఆయన రాజీనామా చేయకపోవడం వల్ల విద్యార్థులకు పెద్దగా నష్టం లేదు. కానీ, ధర్మేంద్రకు ఉన్న గుర్తింపు మాత్రం పోతుంది. ఒకవేళ ఆయన రాజీనామా చేసి ఉంటే, తన పేరు చెడిపోకుండా ఉండేది అని సోనమ్ అభిప్రాయపడ్డారు.ఇదే సమయంలో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఉండకూడదని, కేసులు నమోదైతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయం తనకు తెలుసన్నారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని సోనమ్ తెలిపారు. పేపర్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని ఆయన వెల్లడించారు.



ఢిల్లీలో సీజేపీ ఆందోళనలు.. పాక్ సోషల్ మీడియా అకౌంట్లతో తప్పుడు ప్రచారం!

ప్రస్తుత సీజేపీ (అఏఖ) ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన 480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఈ ఖాతాల ద్వారా వదంతులు, నకిలీ పోస్టులు, ఎడిట్ చేసిన వీడియోలను వ్యాప్తి చేసి విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఈ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేసే ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు తాజాగా గుర్తించిన ఈ ఖాతాల ద్వారా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కూడా తప్పుడు సమాచారం ప్రచారమైందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక వర్గాల ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయిన కనీసం 18 తప్పుడు ప్రచారాలను ఇప్పటికే ఖండించామని తెలిపారునిరసనకారులపై పోలీసులు దాడి చేశారని, ఓ బాలిక మరణించిందని, కొందరు నాయకులను అదుపులోకి తీసుకున్నారని, గోళీలు లేదా మేకులు అమర్చిన లాఠీలు వాడారని వచ్చిన ప్రచారాలు వాస్తవం కాదని పోలీసులు స్పష్టం చేశారు (ఈజీనివ నివలిబ). సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు, వీడియోలు లేదా పోస్టులను నిజానిజాలు తెలుసుకోకుండా ఫార్వర్డ్ చేయొద్దని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం సృష్టించడం లేదా ప్రచారం చేయడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.



వైరాలో బీఆర్ఎస్ శ్రేణుల శ్రమదానం

వైరా టౌన్, జూలై 24 : ప్రజాసేవకే కేటీఆర్ జీవితం అంకితమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావ్, బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం వైరా మధిర రోడ్ లో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద లోతుగా ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత మండలంలో రెండు సంవత్సరాలుగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గుంతలను పూడ్చి వేసినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దెల రవి, లకావత్ గిరిబాబు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, 11వ వార్డు కౌన్సిలర్ దొంతేబోయిన వెంకటేశ్వర్లు, వల్లాపురం ఉప సర్పంచ్ వేల్పుల నారాయణ, లాల్ మహమ్మద్, మిట్టపల్లి సత్యం బాబు, తిరుపతి శ్రీను, మిట్టపల్లి కిరణ్ కుమార్, మరికంటి శివ, కొల్లా రాంబాబు, నూకల ప్రసాదు, ఏదునూరు శ్రీనివాసరావు, వేముల శివ, కందుల ఓంకార్, బొడ్డు రామకృష్ణ, సింగవరపు నరేష్, అనంత వెంకటేశ్వర్లు, మడుపల్లి కృష్ణ, మాచర్ల శంకర్, వీరన్న, అప్పారావు, వల్లేపు రాము, ముదిగుండ్ల పుల్లయ్య పాల్గొన్నారు.

హైడ్రా కు హైకోర్టులో మొట్టికాయలు.. మరోసారి రంగనాథ్‌పై ఆగ్రహం



హైడ్రా పనితీరుపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. మల్కాజ్‌గిరి పరిధిలోని లోతుకుంట భూములపై హైకోర్టులో మరోసారి విచారణ చేపట్టింది. ఒకే పిటిషన్‌లో మూడుసార్లు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం చరిత్రలో ఇదే మొదటిసారి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులపై అప్పీల్ చేయకుండా మళ్లీ అదే భూమిలోకి వెళ్లడం తీవ్ర నేరమని హెచ్చరించింది. సదరు భూమిలో ఆర్మీ రక్షణ ఏర్పాటు చేయాలన్న ఉత్తర్వులను హైకోర్టు వెనక్కి తీసుకుంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

సుజాతనగర్ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ



కొత్తగూడెం టౌన్, జూలై 24 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలోని నిరుద్యోగులు, విద్యార్థులపైన కేంద్ర ప్రభుత్వం చేసే అన్యాయపు దాడులకు నిరసన తెలియచేస్తూ విద్యార్థిని, విద్యార్థులకి తమ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సుజాతనగర్ మండల అధ్యక్షుడు లావుడియా సత్యనారాయణ, చింతలపూడి జగన్, పెద్దమల్ల నరేంద్ర, కార్తీక్, కృష్ణ, చంటి, ప్రదీప్, బాబా, రహీం, సాజిద్, రాజేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.


ఒక్క విద్యావ్యవస్థ కాదు అన్ని వ్యవస్థల్లో దేశం దిగజారిపోతోంది



హైదరాబాద్ : దేశంలో ఒక్క విద్యా వ్యవస్థ కాదు అన్ని వ్యవస్థలు దిగజారిపోయాయని జెన్‌జీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపటిన నిరసనకు వేలాది మంది తరలివచ్చారు. విద్యార్థుల ఉద్యమంపై తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థిని మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీతో ఆవేదనతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు.ఎంతో మంది పిల్లలు, వాళ్ల తల్లిదండ్రులు బాధలో ఉన్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శిం చారు. అలాగే దేశంలో పెట్రోల్ ధరలు, రూపాయి విలువ ఇంకా ఎన్నో వ్యవస్థలు దెబ్బతిన్నాయి. అన్ని మారాలని కోరుకుంటున్నామని తెలిపారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా పూర్తిగా అమ్ముడుపోయిందని స్పష్టంగా కనిపిస్తుంది. ఈ మీడియాపై మా జనరేషన్‌కు నమ్మకంలేదన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు.

ఫ్రాన్స్‌లో వ్యాపిస్తున్న దావానలం.. బోట్లలో వందలాది టూరిస్టుల తరలింపు

పారిస్: ఫ్రాన్స్‌లో దావానల వ్యాపిస్తున్నది. క్యాప్ ఫెర్రట్ ద్వీపకల్పంలో భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. దీంతో అక్కడ ఉన్న వందలాది మందిని బోట్లలో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు. బోర్డియాక్స్‌కు పశ్చిమంగా ఉన్న టూరిస్టు స్పాట్ నుంచి ఇప్పటికే వేల సంఖ్యలో జనాన్ని మరో ప్రాంతానికి తరలించారు. గిరోండే ప్రాంతంలో ఎగిసిపడుతున్న అటవి మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది గత కొన్ని రోజుల నుంచి ప్రయత్నిస్తున్నది. సౌమోస్ ప్రాంతంలో మంగళవారం అటవీ మంటలు వ్యాపించాయి. అక్కడ కార్చిచ్చు వల్ల ఇప్పటికే సుమారు 21 వేల ఎకరాల అటవీ దగ్ధమైంది. క్యాప్ ఫెర్రట్ ద్వీపకల్పం నుంచి ఇప్పటికే 4 వేల మందిని తరలించినట్లు ఫ్రెంచ్ మంత్రి లారెంట్ నూనెజ్ తెలిపారు. సుమారు 80 ఇండ్లు దగ్ధం అయ్యాయి. మరో 50 ఇండ్లు ధ్వంసం అయ్యాయి.



అటు జక్కంపూడి... ఇటు భూమన



విజయవాడ, జూలై 24వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. ఒక దళిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది. సీఐ శేషయ్యను ఉద్దేశించి జక్కంపూడి రాజా అత్యంత అవమానకరమైన మరియు కుల దూషణలతో కూడిన వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు మరియు పోలీస్ వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. కమిషన్ జారీ చేసిన కఠిన ఆదేశాల మేరకు పోలీసులు జక్కంపూడి రాజాపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త చట్టం ప్రకారం బిఎన్ఎస్ 351(2) (ఐపీసీ 351(2)) సెక్షన్‌తో పాటు అత్యంత కఠినమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆయనపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా కర్నూలు పోలీసులు రాజమహేంద్రవరానికి చేరుకుని జక్కంపూడి రాజా నివాసంలో ఆయనకు అధికారికంగా నోటీసులు అందజేశారు. ఈ నెల 28వ తేదీన విచారణాధికారి ముందు స్వయంగా హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన దళిత పోలీస్ అధికారిపై వైసీపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.అయితే, ఆయనపై నమోదైన సెక్షన్లు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందకు రావడం, పైగా నాన్-బైలబుల్ (జామీను లేని) నిబంధనలు ఉండటంతో జక్కంపూడి రాజాకు అరెస్ట్ గండం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న జరిగే విచారణలో ఆయన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినా, లేదా విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేసినా పోలీసులు అతన్ని ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉత్కంఠ రేపుతోంది.తిరుపతి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తును తీవ్రతరం చేసింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో ఉన్న విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం నిశితంగా విచారణ జరుపుతోంది. నదీ గర్భాన్ని సైతం వదలకుండా పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులపై మలిదశ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.భూమన కరుణాకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని గతంలోనే న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు (ఎమ్మార్వోలు) జిల్లా కలెక్టర్ అధికారికంగా ఛార్జ్ మెమోలు జారీ చేశారు.కలెక్టర్ నుంచి ఛార్జ్ మెమోలు అందుకున్న వారిలో గతంలో తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)గా పనిచేసిన రామానుజుల నాయక్, ప్రస్తుత తిరుపతి రూరల్ ఎమ్మార్వో జయంత్, అలాగే శ్రీకాళహస్తి ఎమ్మార్వో ఉన్నారు. భూకబ్జాల వ్యవహారంలో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనంగా వ్యవహరించిన మరికొందరు అధికారుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తన ఆస్తులు ధ్వంసం చేసినా తాను వెనక్కి తగ్గబోనని.. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తానని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వివాదం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ మాటల యుద్ధానికి దారితీస్తోంది. భూముల యాజమాన్యం, రికార్డులు, ఆక్రమణల అంశాలపై రెవెన్యూ శాఖ విచారణ కొనసాగుతోంది.గత 21 ఏళ్లుగా ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ భూములు కనిపించలేదా అని భూమన కరుణాకర్ రెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను కూటమి ప్రభుత్వ విధానాలపై బలంగా గొంతు ఎత్తుతున్నందుకే ఈ కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను మోసాలు, అవినీతి చేసినవాడ్ని కాదని తేల్చి చెప్పారు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు ఎన్నడూ అవకాశం లేదని.. తన జీవితం అంతా విలువలతో కూడిన రాజకీయాలు చేశానని చెప్పుకొచ్చారు. 1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందని.. తన కుటుంబ ఆస్తులు దాడి చేయడం ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందని.. ఇదే ఉత్సాహంతో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు.ఈ భూ అక్రమాలకు సహకరించిన మిగిలిన అధికారులపై సైతం త్వరలోనే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

జగన్ నెక్ట్ ప్లాన్



విజయవాడ, జూలై 24 ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది.జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి.ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు-పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారను కోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది.ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైన ప్రజల్లో ఉండటం, పటిష్టంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అపాయింట్‌మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు

పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

విశాఖపట్టణం, జూలై 24 సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ్ అని పిలుస్తారు.లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

లింక్డిన్ లో వైజాగ్ టాప్

విశాఖపట్టణం, జూలై 24 ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది.లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది.అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి.

89 శాతం కూటమి వైపే ఉన్నారా....

విజయవాడ, జూలై 24 ఏపీలో తాజాగా మరోసారి ఐవీఆర్ ఎస్ సర్వే జరిగిందా? ప్రజల అభిప్రాయాలను మరోసారి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారా? వారి అభిప్రాయాలను దూసుకున్నారా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నాయకులు. పార్టీ పరంగా కాదు.. ఈ సారి కూడా సర్కారు పరంగానే సర్వే సాగిందని చెబుతున్నారు. పార్టీ వర్గాల కథనం మేరకు.. గత మే-జూన్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ప్రధానంగా ఇది సర్కారు విజయంపైనే సాగిందని చెబుతున్నారు. ం మొత్తంగా 5 అంశాలపై ఈ దఫా ఐవీఆర్ ఎస్ సర్వే సాగిందని నాయకులు తెలిపారు. 1) ప్రభుత్వ సంక్షేమ పథకాలు: వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న సర్కారు.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. అలాగే.. అన్ని వర్గాలకు కూడా మేలు చేస్తున్నారు. 2) అన్న క్యాంటీన్లు: గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన దీనిని తాజాగా కొనసాగిస్తున్నారు. ఇది అనేక వేల మందికి మేలు చేస్తోంది. 3) పరిపాలన: క్షేత్రస్థాయిలో కార్యాలయాలకు వెళ్లే అవసరాన్ని దాదాపు తప్పిస్తూ..వాట్సాప్ పాలనను తీసుకువచ్చారు 4) గ్రామీణాభివృద్ధి: ప్రస్తుతం గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం జరుగుతోంది కూడా. ఇలా.. ఈ నాలుగు అంశాలను సర్వేల్లో తీసుకున్నారు. నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక నాయకుల పనితీరుపై సర్వేలు జరిగినా.. ఇంత విస్తృత స్థాయిలో ప్రభుత్వ పనితీరుపై సర్వే జరగడం ఇదే తొలిసారి అనేది నాయకులు చెబుతున్నారు. ఇక, చివరిగా.. 5వ అంశం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన. ఇదే అత్యంత కీలకమని చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో కూటమిగానే వెళ్లాలని కోరుకుంటున్న వారి సంఖ్య 89 శాతం వరకు ఉందని సర్వేలో స్పష్టమైంది. గత కొన్నాళ్లుగా ఇదే మాట ఇటు నాయకులు కూడా చెబుతున్నారు. కూటమిగా ఉంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. తాజాగా ప్రజల నుంచి కూడా అదే అభిప్రాయం వెల్లడి కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు మరింత జోరుగా కూటమి ఐక్యతనే తారకమంత్రంగా పఠించనున్నారు.పార్టీలలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. కూటమి ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సో.. మొత్తంగా ఇప్పటి కంటే కూడా.. కూటమి ఐక్యతకు ఇక నుంచి మరింత ఇంపార్టెన్స్‌తోపాటు.. మరింతగా కలివిడి తనానికి ప్రభుత్వం పరంగా కూడా ప్రాధాన్యం దక్కనుంది.

43 లక్షల మంది లిస్ట్ మిస్

విజయవాడ, జూలై 24 రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38శాతంతోరాష్ట్రంలోనేమొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్లమంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది.

రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% వర్షపాతం లోటు

వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

విజయవాడ,కృష్ణా డెల్టా నీటి పరిస్థితిపై ఇరిగేషన్ ఈఎన్సీ కే. నరసింహ మూర్తి విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్ లో మీడియతో మాట్లాడారు. రాష్ట్రంలో 51%, కృష్ణా డెల్టాలో 49% వర్షపాతం లోటు నమోదయింది. ఎల్నినో ప్రభావంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గాయి. ఎగువ ప్రాజెక్టుల్లో కుషన్ నీటి కారణంగా శ్రీశైలానికి ప్రవాహాలు తగ్గాయి. ప్రభుత్వం తాగునీటికే తొలి ప్రాధాన్యత ఇచ్చింది. 2027 జూన్ వరకు తాగునీటి అవసరాల కోసం నీటి నిర్వహణ చేసామని అన్నారు.పులిచింతల నీటిని కూడా తాగునీటి అవసరాల కోసం భద్రపరిచారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి సరఫరా కొనసాగుతోంది. గోదావరిలో ప్రవాహాలు తగ్గడంతో పట్టిసీమ పంపింగ్పై ప్రభావం పడింది సీలేరు నీటి లభ్యత కూడా తగ్గింది. కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం లేదు. పట్టిసీమలో అన్ని పంపులను ఒకేసారి నడపడం సాధ్యం కావడం లేదు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్లజిల్లాల 60 లక్షల మందికి తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు..ఆర్ఎంసీ నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. అనధికారిక పంపుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ఎంసీ పరిధిలో ప్రస్తుతం వరి సాగు చేయవద్దని సూచిస్తున్నాం. మధ్యలో నీరు లేక పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాం. భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగితే వ్యవసాయ శాఖతో కలిసి నిర్ణయం తీసుకుంటాం. తాగునీటి తర్వాతే ఆరుతడి పంటలకు నీటి కేటాయింపు జరుగుతుంది. కృష్ణా డెల్టా పరిధిలో వరికి బదులుగాఆరుతడిపంటలు సాగు చేయాలి. అసాధారణ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని విజ్ఞతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

స్పోర్ట్స్ న్యూస్

శ్రేయస్ అయ్యర్ అరుదైన వరల్డ్ రికార్డు..

వరుసగా 8 టాస్‌లు గెలిచి సరికొత్త చరిత్ర

టీమిండియా కొత్త టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరుసగా ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన తొలి సారథిగా చరిత్ర సృష్టించాడు. ఈ రికార్డుతో ఇప్పటివరకు ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ప్రత్యేక రికార్డును కూడా అధిగమించాడు. ఈ రికార్డు ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా ఏడు టాస్‌లు గెలిచిన బహామాస్ కెప్టెన్ గ్రెగొరీ టేలర్‌పై ఉంది. అదే విధంగా, 2010 నుంచి 2012 మధ్య టీమిండియాకు నాయకత్వం వహించిన ఎంఎస్ ధోనీ కూడా వరుసగా ఏడు టాస్‌లు గెలిచి భారత రికార్డు సృష్టించారు. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్ వరుసగా ఎనిమిది టాస్‌లు గెలిచి ఇద్దరి రికార్డులను అధిగమిస్తూ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాడు.టాస్ విషయంలో అదృష్టం కలిసొచ్చినట్లే, మ్యాచ్ ఫలితంలో కూడా శ్రేయస్ అయ్యర్‌కు శుభారంభమే లభించింది. హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టాస్ గెలిచిన అయ్యర్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 125/7 పరుగులకే పరిమితమైంది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తన వేగవంతమైన బౌలింగ్‌తో రెండు కీలక వికెట్లు పడగొట్టి 2/18 గణాంకాలు నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.ఇక 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుఫాన్ ఆరంభాన్ని అందించాడు. కేవలం 18 బంతుల్లోనే



అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేసింది.వైభవ్ ఇచ్చిన బలమైన ఆరంభాన్ని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28×), ఇషాన్ కిషన్ (35) చక్కగా కొనసాగించారు. ఇద్దరూ బాధ్యతాయుతంగా ఆడి భారత్‌ను ఎలాంటి ఒత్తిడి లేకుండా విజయతీరాలకు చేర్చారు. భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒకవైపు వరల్డ్ రికార్డు, మరోవైపు కెప్టెన్‌గా తొలి విజయం సాధించిన శ్రేయస్ అయ్యర్‌కు ఈ మ్యాచ్ చిరస్మరణీయంగా మారింది. యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో భారత జట్టు సిరీస్‌ను విజయంతో ప్రారంభించగా, మిగతా రెండు మ్యాచ్‌లపైనా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆసియా క్రీడలు: క్రికెట్ షెడ్యూల్ విడుదల.. నేరుగా క్వార్టర్ ఫైనల్‌లోకి టీమిండియా



జపాన్ వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో క్రికెట్ నాలుగోసారి చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మహిళల టీ20 మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న ప్రారంభం కానుండగా.. పురుషుల టోర్నీ సెప్టెంబర్ 24 నుంచి మొదలు కానుంది. అన్ని మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్‌లో జరగడంతో పాటు పూర్తి అంతర్జాతీయ హోదా కలిగి ఉండనున్నాయి. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగనున్నాయి.పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇక గ్రూప్-ఎలో అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బిలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ జట్లు మిగిలిన నాలుగు క్వార్టర్ ఫైనల్ స్థానాల కోసం పోటీపడనున్నాయి. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు జట్లు సూపర్ 8 దశకు చేరుకుంటాయి. కాగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఈ టోర్నీలో లీగ్ లేదా క్వార్టర్ ఫైనల్‌లో జరిగే అవకాశం లేదు. ఇరు జట్లు సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో తలపడే అవకాశం ఉంటుంది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్-పాక్ పోరు జరగాలంటే రెండు జట్లు చివరి దశ వరకు చేరాల్సిందే.భారత మహిళల క్రికెట్ జట్టు క్వార్టర్ ఫైనల్‌లో జపాన్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్ లేదా చైనాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు శ్రీలంక-మలేషియా, పాకిస్థాన్-థాయ్‌లాండ్ మధ్య మిగిలిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా కొనసాగుతుండగా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. పురుషుల జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో చోటు లభించిన సంగతి తెలిసిందే.

ఫిడే తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విశ్వనాథన్ ఆనంద్



భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఫిడే అధ్యక్షుడు అర్కాడీ ద్వోర్కోవిచ్‌పై యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు విధించడంతో ఆయన తన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఫిడే నిబంధనల ప్రకారం ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆనంద్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాతో సంబంధాలున్న పలువురు ప్రముఖులపై ఈయూ తాజాగా ఆంక్షలు ప్రకటించింది. ఇందులో రష్యా మాజీ ఉప ప్రధాని అర్కాడీ ద్వోర్కోవిచ్ పేరు కూడా ఉండటంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ద్వోర్కోవిచ్ 2018 నుంచి ఫిడే అధ్యక్షుడిగా కొనసాగుతోన్న సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా ఆనంద్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఫిడే అధ్యక్షుడు అర్కాడీ ద్వోర్కోవిచ్ తన బాధ్యతల నుంచి తాత్కాలికంగా తప్పుకున్నారు. దీంతో ఫిడే చార్టర్ ప్రకారం నేను తాత్కాలిక అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించాను. ఫిడే స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకున్న ద్వోర్కోవిచ్‌కు ధన్యవాదాలు. ఫిడే కౌన్సిల్, పరిపాలనా బృందం, సభ్య దేశాల సమాఖ్యలతో కలిసి సంస్థ కార్యకలాపాలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా కృషి చేస్తాను. ద్వోర్కోవిచ్ బలమైన బృందాన్ని, స్పష్టమైన దిశను ఏర్పాటు చేశారు. ఆ ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడం ఇప్పుడు మన అందరి బాధ్యత' అని ఆనంద్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్లో భారత్.. నాకౌట్‌లో తలపడే జట్లు ఇవే..!



జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడలు 2026 క్రికెట్ నాకౌట్ బెర్తులు ఖరారయ్యాయి. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ మెగా టోర్నీకోసం గురువారం (ఆగస్టు 24) జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లతో పురుషుల, మహిళల విభాగాల్లో మొత్తం ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో టీమిండియాతో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సైతం క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. మహిళల విభాగంలోనూ భారత్ సహా నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్ ఆడనున్నాయి.ఆసియా క్రీడల క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్ వచ్చేసింది. జపాన్ వేదికగా జరుగనున్న ఈ మెగా ఈవెంట్ గ్రూప్ దశగా.. భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మిగిలిన వాటిని క్వార్టర్స్‌కు క్వాలిఫయింగ్ రౌండ్ కోసం ఆరు జట్లను రెండు గ్రూపులుగా విభజించారు.గ్రూప్ ఏలో అఫ్గనిస్థాన్, జపాన్, నేపల్ ఉండగా.. గ్రూప్ బీలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ జట్లు నిలిచాయి. మహిళల క్రికెట్ విభాగంలో అవసరం లేకుండానే ఎనిమిది జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. నేరుగా నాకౌట్ పోరు నిర్వహించనుండగా టీమిండియాతో జపాన్ తలపడనుంది. ఈ మ్యాచ్ విజేత బంగ్లాదేశ్, చైనా మ్యాచ్ గెలుపొందిన జట్టును ఢీకొట్టనుంది.ఆసియా క్రీడల్లో క్రికెట మ్యాచ్‌లు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జరుగనున్నాయి. పురుషుల జట్ల మ్యాచ్‌లు సెప్టెంబర్ 24వ తేదీన మొదలై అక్టోబర్ 1వ తేదీన పూర్తవుతాయి. కానీ, మహిళల జట్ల మ్యాచ్‌లు మాత్రం ఆరు రోజుల్లోనే ముగియనున్నాయి. సెప్టెంబర్ 17 నుంచి సెప్టెంబర్ 22 వరకూ మహిళల ఛాంపియన్ ఎవరో తేలియనుంది.

నా హాఫ్ సెంచరీ వారందరికీ అంకితం: వైభవ్ సూర్యవంశీ

జింబాబ్వేతో తొలి టీ20లో మెరుపు హాఫ్ సెంచరీతో అదరగొట్టిన భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ.. మ్యాచ్ అనంతరం బీసీసీఐకి ఇంటర్వ్యూ ఇచ్చాడు. తన ఇన్నింగ్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జింబాబ్వేతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన చేసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.'కెరీర్ ప్రారంభ దశలోనే ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. రాబోయే మ్యాచ్‌లకు ఇది మంచి ప్రేరణగా ఉంటుంది. నేను నా జోన్‌లోనే ఉన్నాను. నా బలం ఏంటో నాకు తెలుసు. నా బలంపై నమ్మకం పెట్టుకునే ఆడాను. అదే నాకు విజయాన్ని అందించింది. నా కుటుంబానికి, కోచ్‌లకు, కష్ట సమయాల్లో నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ నా హాఫ్ సెంచరీని అంకితం చేస్తున్నాను. నేను చేసి 'ఏ' సెలబ్రేషన్ మా అమ్మ కోసం. మరో సెలబ్రేషన్ రింకూ భయ్యా (రింకూ సింగ్)తో జరిగిన ఓ సంభాషణ ఆధారంగా చేశాను' అని వైభవ్ సూర్యవంశీ వివరించాడు.'ఇక్కడి వాతావరణం నాకు చాలా నచ్చింది.



కొన్ని మైదానాల్లో పరుగులు చేయడం సహజంగానే సులభంగా అనిపిస్తుంది. హరారే కూడా అలాంటి మైదానమే కావచ్చు. అయితే దీన్ని నేను తేలికగా తీసుకోను. ఇంకా మెరుగుపడుతూ జట్టుకు నా వంతు సహకారం అందించేందుకు శ్రమిస్తాను' అని వైభవ్ పేర్కొన్నాడు. తొలి టీ20లో విజయం సాధించిన భారత జట్టు.. జులై 25న అదే హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్న రెండో టీ20లో జింబాబ్వేతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది.

గంభీర్ విధానంపై అశ్విన్ విమర్శలు.. టీమ్‌లో స్పష్టత అవసరమని వ్యాఖ్య

2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టు సన్నద్ధమవుతున్న వేళ.. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అమలు చేస్తున్న సెలక్షన్ విధానంపై టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. ప్రస్తుతం జట్టులో పూర్తిస్థాయి ఆల్‌రౌండర్లకు బదులుగా.. అడపాదడపా రాణించే క్రికెటర్లపై ఆధారపడటం పెద్ద సమస్యగా మారిందని అభిప్రాయపడ్డాడు. ఇది ఏమాత్రం సరైన వ్యూహం కాదన్నాడు అశ్విన్.ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో అశ్విన్ పలు కీలక అంశాల గురించి మాట్లాడాడు. హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలు జట్టుకు పెద్ద సవాలుగా మారాయని, అతనికి సరైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయడంలో టీమ్ మేనేజ్‌మెంట్ విఫలమైందని పేర్కొన్నాడు. ప్రస్తుతం.. నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే పేర్లు వినిపిస్తున్నప్పటికీ, గాయాల బెడద కారణంగా వారిపై పూర్తిస్థాయిలో ఆధారపడటం కష్టమేనన్నాడు. దీనికి 2023 వన్డే ప్రపంచకప్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. 'హార్దిక్ గాయపడిన సమయంలో నాటి కోచ్ రాహుల్ ద్రవిడ్ చక్కటి వ్యూహాన్ని అమలు చేశారు. ఆరో బౌలర్ కోసం వెతకలేదు. ఐదుగురు బౌలర్లతోనే జట్టును సమతూకంగా నడిపించి టీమ్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లగలిగారు' అని చెప్పుకొచ్చాడు. జట్టులోని ప్రతి ఆటగాడికీ తన పాత్రపై స్పష్టత ఉండటం ద్రవిడ్ విధానంలో ప్రధాన బలమని ఈ మాజీ స్పిన్నర్ వివరించాడు.'ప్రస్తుతం.. గౌతీ ఆధ్వర్యంలోని టీమ్ మేనేజ్‌మెంట్ అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఆటగాళ్లపై అతిగా దృష్టి సారిస్తోంది. దానివల్ల టెస్ట్ క్రికెట్‌లో కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.



టెస్టుల్లోనైనా, ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లోనైనా మ్యాచ్ విజేతలుగా నిలిచే ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఆటగాళ్లకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి' అని అశ్విన్ సూచించాడు. వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా.. తొలుత 17-18 మంది ప్లేయర్లతో ఒక స్థిరమైన జట్టును ఫిక్స్ చేసుకోవాలని అశ్విన్ సలహా ఇచ్చాడు. వచ్చే 14 నెలలపాటు వారినే రొటేషన్ పద్ధతిలో ఆడించాలన్నాడు. ఆ టీమ్‌లో ఇద్దరు వికెట్ కీపర్లు, ముగ్గురు స్పిన్నర్లు, ఐదుగురు పేసర్లు ఉండేలా ప్లాన్ చేసుకోవాలని చెప్పుకొచ్చాడు. ప్రపంచకప్ ఆరంభమయ్యే సమయానికి అత్యుత్తమ తుది జట్టును సిద్ధం చేయడమే లక్ష్యంగా ఉండాలని.. ప్రస్తుతం జట్టు ఎంపికలో అలాంటి స్పష్టత లోపించిందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం - నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, జులై 24: కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

ఈ నేపథ్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ 25వ డివిజన్ సుభాష్‌నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా సీసీ డ్రెయిన్ల నిర్మాణం, ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రతి



ఇంటికి తాగునీరు అందేలా పైప్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా కరీంనగర్ నగరంలోనూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, చేపట్టిన పనులను సంరక్షిస్తూ పరిశుభ్రమైన పరిసరాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ ఆదేశించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకుఅనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు కూడా దశలవారీగా చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, 25వ డివిజన్ కార్పొరేటర్ గంట శ్రీనివాస్, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతాప రామకృష్ణ 66వ జన్మదిన వేడుకలు

వేములవాడ, జులై 24: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సనాతన ధర్మ పరిరక్షకుడు ప్రతాప రామకృష్ణ 66వ జన్మదిన వేడుకలను బీజేపీ వేములవాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి 66 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ వేములవాడలో పార్టీ బలోపేతానికి ప్రతాప్ రామకృష్ణ విశేషంగా కృషి చేశారని, ప్రజలకు ఎల్లప్పుడూ



అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. రాజన్న, భీమన్న ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.

కౌన్సిలర్లు ముత్యం వంగల శ్రీను, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, కోలా కృష్ణస్వామి, నాయకులు రేగుల మల్లికార్జున్, రేగుల శ్రీకాంత్, కటకం శ్రీనివాస్, నామాల శేఖర్ తదితరులు మాట్లాడుతూ ప్రతాప రామకృష్ణ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని దేవాలయంలో ప్రత్యేక మొక్కులు చెల్లించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, బోనాల శివ, మామిళ్ల లక్ష్మీరాజం, పిన్నింటి హనుమాండ్లు, గుడిసె మనోజ్, బిల్ల కృష్ణ, వాసం మల్లేశం, డాక్టర్ వెంకన్న, చిక్కుడు మల్లేశం, సగ్గు రాహుల్, సత్యం, తిరుమల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నెముకలాంటి సంస్థ

దేశంలోనే అగ్రగామి బొగ్గు సంస్థగా మరింత బలోపేతం కావాలని సింగరేణి ప్రయోజనాలే మాకు ముఖ్యం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 24 తెలంగాణ పవర్ : కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు ఏరియా పీకే ఓసీ -2 ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్ ని సందర్శించారు. గని పనితీరు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గనిలో జరుగుతున్న తవ్వకాల ప్రక్రియ, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, యంత్రాల పనితీరు, భద్రతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 1976లో ప్రారంభమైన ఈ గని చరిత్ర, ఇప్పటివరకు జరిగిన బొగ్గు ఉత్పత్తి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలు, గని జీవితకాలం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బొగ్గును స్వయంగా చేతిలోకి తీసుకుని దాని నాణ్యతను పరిశీలించారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నెముకలాంటి సంస్థ అని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వల పెంపు, ఉత్పత్తి విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని

రాబోయే రోజుల్లో కొత్త బొగ్గు గనుల కేటాయింపునకు సంబంధించి నిర్వహించే వేలం ప్రక్రియలో సింగరేణి సంస్థ చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను సొంతం చేసుకునేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. పోటీ ప్రపంచంలో సింగరేణి తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ దేశంలోనే అగ్రగామి బొగ్గు సంస్థగా మరింత బలోపేతం కావాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థ వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్ ఉత్పత్తి అవసరాలు, దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై



స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, రాష్ట్ర విద్యుత్ రంగ అవసరాలను తీర్చడంలో, పారిశ్రామికాభివృద్ధికి ఊతమివ్వడంలో, వేలాది మంది కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించడంలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందన్నారు.సింగరేణి భవిష్యత్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు

సంస్థ అభివృద్ధి, విస్తరణ, కొత్త బొగ్గు బ్లాకుల సాధన, ఉద్యోగుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. సింగరేణి భవిష్యత్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతుందని అధికారులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌సీసీఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్, టీఎస్‌జెన్‌కో చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఐఏఎస్, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ ఉ వెల్ఫేర్) గౌతమ్ పొట్రూ, సింగరేణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

128 ఎకరాల్లో మెగా ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్

ఆయిల్‌పామ్ తోటను పరిశీలించిన పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఆయిల్ ఫామ్ సాగును పెద్దపల్లి జిల్లాలో విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా శుక్రవారం 128 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామానికి చెందిన రైతు గీత్ల పవన్ కుమార్‌రెడ్డి 17 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ తోటను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, నాట్ల నాణ్యత, గెలల కొనుగోలు విధానం, ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలపై ఉద్యానవన శాఖ అధికారులు, తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.

తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ బురారియా మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అక్టోబర్ నెలలో ఫ్యాక్టరీని ప్రారంభించి కార్యకలాపాలు ప్రారంభించేలా



చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌కు వివరించారు.

రైతుల విజయానికి నాణ్యమైన మొక్కలే కీలకమని పేర్కొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రైతులకు అత్యుత్తమ నాణ్యత కలిగిన ఆయిల్‌పామ్ మొక్కలను మాత్రమే సరఫరా చేయాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. మొక్కల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, దీర్ఘకాలంలో రైతులకు అధిక దిగుబడి, స్థిరమైన ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. (వి.బి.జి. రాంజీ) పథకం కింద ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఫార్మ్ పాండ్లను ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షపు నీటిని ఫార్మ్ పాండ్లలో నిల్వ చేసి అవసరమైన సమయంలో తోటలకు అందించడం ద్వారా పొడి వాతావరణ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని వివరించారు.

ఆయిల్‌పామ్ తక్కువ నీటి వినియోగంతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే వాణిజ్య పంటగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలో అనుకూల భూములు, నీటి వనరులు ఉన్న రైతులు ఈ సాగు వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ఫార్మ్ పాండ్లు వంటి ఆధునిక నీటి సంరక్షణ పద్ధతులను అనుసరిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్, తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ ఎండీ మనీష్ బురారియా, సీఈవో కేశు కల్యాణ్‌కర్, ఉద్యానవన అధికారి మహేష్, వ్యవసాయ అధికారి సంధ్య, హెచ్‌ఈఓ బి.రాము, బి.మహేష్, కునారం సర్పంచ్ రాజయ్య, జాఫర్‌ఖాన్‌పేట సర్పంచ్ యాదగిరి-జ్యోత్స్న, కునారం, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాల రైతులు, ఆయిల్‌పామ్ సాగుదారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

-జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కీలక రహదారి ప్రాజెక్టులపై వినతులు



జహీరాబాద్ జూలై 24: బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర మంత్రికి ఎమ్మెల్యేలు మాణిక్ రావు, చింతా ప్రభాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ లు వినతిపత్రాలు అందజేశారు.

జహీరాబాద్--బీదర్ రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి, నాలుగు లేన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేసారు.పెరుగుతున్న పారిశ్రామిక,వాహన రద్దీ దృష్ట్యా జహీరాబాద్ -సంగారెడ్డి (ఎన్హెచ్ -65)ని ఆరు లేన్లుగా మార్చాలని కోరారు.కోహీర్ మండలం దిగ్వాల్ వద్ద ప్రతిపాదించిన ఫ్లైఓవర్/అండర్‌పాస్‌ను 30 మీటర్లకు పొడిగించి, సర్వీస్ రోడ్లు నిర్మించాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఊతమిచ్చే కీలక రహదారి ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని బీఆర్ఎస్ నేతలు కోరారు.న్యాల్కల్ మండలంలో నిమ్జ్, జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, ఇతర లాజిస్టిక్స్ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రతిరోజూ 2 వేలకు పైగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయని మంత్రికి వివరించారు. జహీరాబాద్, కోహీర్, న్యాల్కల్, ఝరాసంగం, మొగుడంపల్లి ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యం కోసం బీదర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు ఈ రోడ్డు మార్గం ద్వారా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రస్తుతమున్న రెండు లేన్ల రోడ్డు ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరిస్తే.. అత్యవసర వైద్య సేవలు వేగవంతం కావడంతో పాటు, రవాణా ఖర్చులు తగ్గి రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్ లు పేర్క

సినిమా

ఓటీటీలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ – ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ – ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

విడాకుల తర్వాత నిహారికకి కలిసొచ్చిందా.. తండ్రికి తగ్గ తనయ!

ఈ మధ్యకాలంలో కొంతమంది సెలబ్రిటీల విషయంలో చోటు చేసుకుంటున్న అనూహ్య పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇకపోతే ఈ మధ్యకాలంలో నాగచైతన్య, అఖిల్ అక్కినేని, సమంత లాంటి సెలబ్రిటీలు వివాహం తర్వాత మంచి సక్సెస్ ను అందుకొని దూసుకుపోతుంటే.. మరికొంతమంది తమ భాగస్వాములకు విడాకులు ఇచ్చిన తర్వాత మరింత జోరు పెంచారు. అలాంటి వారిలో నిహారిక కూడా ఒకరు. పెద్దలు కుదిర్చిన వివాహాన్ని చేసుకున్నా.. ఆ పెళ్లి మూన్నాళ్ల ముచ్చటగానే మిగలగా.. ఆ తర్వాత ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్న మెగా డాటర్ ఇప్పుడు రెట్టింపు వేగంతో దూసుకొచ్చి ఏకంగా నేషనల్ అవార్డును అందుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. టీవల జూలై 18వ తేదీన న్యూఢిల్లీ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు చిత్రానికి ఏకంగా రెండు నేషనల్ అవార్డులు లభించాయి .ఒకటి ఉత్తమ ప్రాంతీయ చిత్రం కాగా.. మరొకటి బెస్ట్ మేకప్ విభాగంలో నేషనల్ అవార్డులు లభించడంతో పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజన్స్ నిహారికపై అలాగే కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఓనీలతివబ ఇకపోతే ఇదే సమయంలో నాగబాబుకు సంబంధించిన ఒక విషయం సోషల్ మీడియాలో



వైరల్ గా మారింది. 38 ఏళ్ల తర్వాత తండ్రి రికార్డును నిహారిక రీ క్రియేట్ చేసింది అంటూ కామెంట్లు చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. 1988లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా కే బాలచందర్ దర్శకత్వం వహించిన రుద్రవీణ చిత్రాన్ని.. నిర్మాతగా నాగబాబు నిర్మించారు. అయితే ఈ సినిమా కమర్షియల్ గా ప్రేక్షకులను మెప్పించలేదు. కానీ ఏకంగా నేషనల్ అవార్డులను అందుకొని అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ చిత్రం మూడు విభాగాలలో నేషనల్ అవార్డును అందుకుంది.

స్పిరిట్ వంగా అప్డేట్.. సినిమా కోసం నెక్ట్స్ లెవెల్ వెయిటింగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేతిలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల లిస్ట్ చూస్తే, రాబోయే రెండేళ్ల పాటు ఇండియన్ బాక్సాఫీస్‌లో ఆయన హవా కొనసాగడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఆడియన్స్ ముందుకు రానున్న ఫౌజీపై భారీ అంచనాలుండగా, ఆ వెంటనే స్పిరిట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రెండు సినిమాలు జానర్ పరంగా భిన్నంగా ఉండటంతో పాటు, ప్రభాస్ కెరీర్‌లో మరో కొత్త దశను ఆవిష్కరిస్తాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. రీసెంట్ గా స్పిరిట్ సినిమాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ పై డైరెక్టర్ నుంచి వచ్చిన ఇన్ఫర్మేషన్ ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆల్రెడీ స్పిరిట్ షూటింగ్ 40% పూర్తైందని ఆయన చెప్పారు. మూవీ అనుకున్న ప్లాన్ ప్రకారమే ముందుకు సాగుతోందనే సంకేతాలు కనిపించడంతో, 2027 రిలీజ్‌పై నమ్మకం మరింత బలపడింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల లిస్ట్ లో చోటు సంపాదించుకున్న ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో డిస్కషన్ కూడా వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ విదేశాల్లో హాలీడేస్ ను ఎంజాయ్ చేస్తున్నప్పటికీ, తిరిగొచ్చిన వెంటనే ఆయన షెడ్యూల్ మళ్లీ బిజీ కానుంది. ముందుగా ఫౌజీ షూటింగ్ కు డేట్స్ కేటాయించి, తర్వాత స్పిరిట్ తర్వాతి షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. భారీ స్థాయి సినిమాలను సమాంతరంగా సమన్వయం చేస్తూ ముందుకు సాగడం ప్రభాస్ కెరీర్‌లో ప్రత్యేకంగా కనిపిస్తోంది. మరోవైపు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా వర్కింగ్ స్టైల్ కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా తన సినిమాలకు సంబంధించిన షూటింగ్



వివరాలను తరచుగా బయటపెట్టని ఆయన, అవసరమైన సందర్భాల్లో మాత్రమే రియాక్ట్ అవుతారనే సంగతి తెలిసిందే. అందుకే స్పిరిట్ షూటింగ్ పై ఆయన డైరెక్ట్ గా మాట్లాడటం ఫ్యాన్స్ లో మరింత ఆసక్తిని పెంచింది. సినిమా గురించి చిన్న అప్డేట్ వచ్చినా పెద్ద డిస్కషన్ గా మారే స్థాయిలో ఈ కాంబినేషన్‌పై అంచనాలు నెలకొన్నాయి. దీంతో మరో ఇంట్రెస్టింగ్ విషయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. షూటింగ్ వర్క్ శరవేగంతో సాగుతున్నాయంటే, ఇక ఫస్ట్ లుక్ ఎప్పుడు? టీజర్ రిలీజ్ కు ఇంకా ఎంత టైముంది? అనే డిస్కషన్ ఫ్యాన్స్ లో మొదలైంది. అఫీషియల్ అనౌన్స్‌మెంట్స్ ఇంకా రాకపోయినా, ప్రతి చిన్న అప్‌డేట్‌ను సెలబ్రేట్ చేసే స్థాయికి ఈ సినిమాపై క్రేజ్ పెరిగింది. 2027 బాక్సాఫీస్ రేసులో స్పిరిట్ కీలక పోటీదారుగా నిలిచే అవకాశాలపై ఇప్పటికే సినీ వర్గాల్లో విశ్లేషణలు మొదలయ్యాయి.

గాడ్ ఆఫ్ వార్ లో ఆ క్రేజీ బ్యూటీ!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి పాన్ ఇండియా సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో? చెప్పాల్సిన పనిలేదు. 'డ్రాగన్' విజయం సాధిస్తే తారక్ పాన్ ఇండియా ఇమేజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది. ఈ నేపథ్యంలో ఆ ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని గురూజీ గాడ్ ఆఫ్ వార్ చిత్రాన్ని తెరకెక్కించాల్సి ఉంటుంది. అందుకు అన్ని రకాలుగా గురూజీ సిద్ధంగానే ఉంటారు. ఇప్పటికే సినిమా కాన్సెప్ట్ లీక్ అయింది. కార్తీకేయ స్వామి నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ పాత్రకు సంబంధించి తారక్ ప్రిపరేషన్స కూడా మొదలు పెట్టేసాడు. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ? ఎవరు అన్నది ఇంతవరకూ ఎక్కడా చర్చకు రాలేదు. తారక్ ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉండటం..త్రివిక్రమ్ ఆదర్శ కుటుంబం సినిమాతో తల మునకలై ఉండటంతో? గాడ్ ఆఫ్ వార్ కు సంబంధించిన విషయాలు పెద్దగా చర్చకు రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాణీ పేరు బలంగా వినిపిస్తోంది. ఇంత వరకూ కియారా– తారక్ కాంబినేషన్ ఏ సినిమా కోసం చేతులు కలిపింది లేదు. ఇదే తొలిసారి కావడంతో? ఆసక్తికరంగా మారింది. కియారాకు పాన్ ఇండియా ఇమేజ్ ఉంది. ంటలవతీబితిబవఎవనిబి అమ్మడు హీరోయిన్ గా నటిస్తోన్న 'టాక్సిక్' విజయం సాధిస్తే ఆ ఇమేజ్ రెట్టింపు అవుతుంది. ఇవన్నీ దృష్టి లో పెట్టుకునే గురూజీ కియారాకి టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. త్రివిక్రమ్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రత్యేకత ఉంటుంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను అద్భుతంగా తీర్చిదిద్దుతారు. కియారా అద్వాణీకి ఉన్న స్టార్ ఇమేజ్, ఎన్టీఆర్ స్థాయికి సరిగ్గా సరిపోతుందని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. తారక్ ఈ సినిమా కోసం లుక్ .. మేనరిజమ్స్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.



చిన్న సినిమాలకు అండగా పాన్ వరల్డ్ దర్శకులు!

ప్రస్తుతం టాలీవుడ్ లో ఎన్నో కొత్త మార్పులు కనిపిస్తున్నాయి. ప్రత్యేకించి ఈ రెండు మూడేళ్ల కాలంలో వస్తోన్న మార్పులు పరిశ్రమను మరింత ముందుకు తీసుకెళ్తున్నాయి. ఒకప్పుడు తమ సినిమాలకే పరిమితమైన అగ్ర దర్శకులు ఇప్పుడు కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నారు. రాజమౌళి, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగ, సుకుమార్ వంటి స్టార్ డైరెక్టర్లు చిన్న సినిమాల నిర్మాణంలో భాగస్వాములవుతూ వాటికి తమ బ్రాండ్ వాల్యూను జోడిస్తున్నారు. ఇది చిన్న సినిమాల బడ్జెట్ పెంచడమే కాకుండా? మార్కెట్‌లో వాటికి క్రేజ్ తీసుకు రావడానికి ఎంతగానో దోహదపడుతోంది. టాలీవుడ్వార్తలు అవకాశాలు అందుకోలేని భామలు! దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తనదైన శైలిలో ఈ మార్పుకు శ్రీకారం చుట్టారు. ఆయన తన కుమారుడు కార్తి కేయ నిర్మిస్తోన్న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' వంటి వైవిధ్యభరితమైన ప్రాజెక్ట్ కు సమర్పకుడిగా వ్యవహరించి ప్రత్యేకమైన గుర్తింపునిస్తున్నారు. భారీ చిత్రాలను రూపొందించే క్రమంలో జక్కన్న అనుభవం, మార్కెట్ అవగాహన చిన్న సినిమాలకు ఆక్సిజన్‌లా పని చేస్తుంది. ఒక స్టార్ దర్శకుడి పేరు తోడైతే? ఆ సినిమాపై ప్రేక్షకుల్లో ఉండే అంచనాలు అంతకంతకు పెరుగాయన్నది వాస్తవం.'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి భారీ చిత్రాలతో పాన్ ఇండియాని శాసించిన ప్రశాంత్ నీల్ కూడా ఈ కొత్త ఒరవడిలో భాగమయ్యారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో వస్తోన్న హారర్ థ్రిల్లర్ '418' చిత్రానికి మద్దతుగా నిలుస్తున్నారు. ఒక మాస్ దర్శకుడు థ్రిల్లర్ జానర్‌ను ప్రోత్సహించడం అనేది పరిశ్రమలో కొత్త ఊపును తెస్తోంది. ప్రశాంత్ నీల్ వంటి దర్శకుల మద్దతు ఉండటం వల్ల చిన్న చిత్రాలు కూడా పెద్ద స్థాయిలో ప్రమోషన్ పొందే అవకాశం దక్కుతోంది. ఇది చిన్న నిర్మాతల భయాన్ని పోగొట్టి కొత్త కథలను నమ్మి ముందుకు వచ్చేలా చేస్తోంది. సందీప్ రెడ్డి వంగ సైతం తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. సుమంత్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న 'రోమాకం' అనే రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను స్వయంగా నిర్మిస్తున్నారు. ఆ రకంగా సందీప్ కొత్తవారికి తనదైన ప్లాట్‌ఫామ్‌ను కల్పిస్తున్నారు. కమర్షియల్ హంగులతో కూడిన రొమాంటిక్ కథలకు సందీప్ రెడ్డి వంగ మార్క్ తోడైతే ఆ సినిమా యువతను ఆకట్టుకుంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రతిభ ఉన్న యువతను వెతికి మరీ అవకాశాలు ఇవ్వడం సందీప్ గొప్పతనానికి నిదర్శనం.ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో సుకుమార్ ఎప్పుడూ ముందుంటారు. 'సుకుమార్ రైటింగ్స్' ద్వారా ఆయన ఇప్పటికే ఎంతోమంది కొత్త దర్శకులను, నటులను వెండితెరకు పరిచయం చేశారు. ఒక స్టార్ దర్శకుడు చిన్న సినిమాల నిర్మాతగా మారడం వల్ల ఆ సినిమాల మేకింగ్ క్వాలిటీ, స్క్రిప్ట్ విషయంలో మరింత స్పష్టత వస్తోంది. సీనియర్ దర్శకుల సలహాలు, సూచనలు చిన్న సినిమాలకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. ఇది పరిశ్రమలో ఆరోగ్యకరమైన పోటీని సృజనాత్మకతను పెంపొందిస్తోంది. సినిమాసమీక్షలు స్టార్ దర్శకుల సహకారం వల్ల టాలీవుడ్ భవిష్యత్తు మరింత సుసంపన్నం కానుంది. ఇది సినిమాల నిర్మాణానికే పరిమితం కాకుండా మంచి కథకు గ్లోబల్ రీచ్ ఇచ్చేలా చేస్తోంది. చిన్న సినిమాలకు అగ్ర దర్శకులు దన్నుగా నిలవడం వల్ల కొత్త కథలు, కొత్త ఆలోచనలు వెలుగు చూస్తున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే టాలీవుడ్ ప్రపంచ సినిమా స్థాయిలో మరిన్ని అద్భుతాలను సృష్టించే అవకాశం ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS : 1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844